తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## పంటలపై ఏనుగుల దాడి

బంగారుపాళ్యం, నవంబర్ 28 ప్రభాతవార్త



మండలంలోని పాలేరు పంచాయతీ రాళ్ళవంక గ్రామ సమీపం పంటలపై సోమవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. టేకు మంద అటవీ బీటు నుండి ఈ ఏనుగుల గుంపు పంటలపై పడి వరి, మామిడి పంటలను నాశనం చేశాయి. గ్రామంకు చెందిన వేలు మందడి, రమేష్, మొగిలప్పలకు చెందిన వరి, మామిడి పంటలను తొక్కి పడేశాయి. ఈ మేరకు బాధిత రైతులు అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. ప్రభుత్వ పరమైన నష్టపరిహారం చెల్లింపుకు నివేదికలు పంపుతామని అధికారులు తెలిపారు.

## సూళ్లూరుపేటలో గంజాయి పట్టివేత



పట్టుబడిన నిందితులతో ఎస్ఇబి అధికారులు

సూళ్లూరుపేట, నవంబర్ 28 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న 10 కేజిల గంజాయిని ఎస్ఇబి అధికారులు పట్టుకున్నారు. వైజాగ్‌లో 10 కేజిల గంజాయిని అనిల్ అనే వ్యక్తి శ్రీనాథ్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి తీసుకొని రూ.10 వేలకు కిరాయి ఒప్పందం కుదుర్చుకొని దాన్ని చెన్నైకి అక్రమంగా తరలించే క్రమంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లోని ఆటోస్టాండు వద్ద ఎస్ఇబి అధికారులు పట్టుకున్నారు. ఈ కేసులో శ్రీనాథ్‌రెడ్డి, అనిల్, మంజునాథ్ అనే ముగ్గురిని ఈ కేసులో నిందితులుగా చేర్చడం జరిగిందని ఎస్ఇబి సిఐ సూర్యనారాయణ తెలిపారు. వీరిలో గంజాయితో పట్టుబడిన శ్రీనాథరెడ్డిని అరెస్టు చేసి 10 కేజిల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు, ఈ గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఎస్ఇబి ఎఎస్పీ ఎ.రాజేంద్ర ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించామన్నారు. ఎస్ఇబి ఎస్ఐ వి.శశికుమార్, కానిస్టేబుళ్లు పోలయ్య, రామనరసయ్య, మనోహర్, విఆర్ఓ తిరుమలేష్, విఆర్ఎ శివలు ఈ దాడుల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

# డిసెంబర్ 15 నుంచి ఆడుదాం ఆంధ్ర

### గ్రామ,వార్డు స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కార్యక్రమం నిర్వహణ : జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి



ఆడుదాం ఆంధ్రా గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి (క్రీడా), నవంబర్ 28, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్‌లో 15 సంవత్సరం పైబడిన యువతను క్రీడల నందు పాల్గొనేందుకు ప్రోత్సహించటం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు వారికి మంచి అలవాట్లు అలవర్చుకోవడంలో క్రీడల ప్రాముఖ్యతను తెలుసుకోవాలనే ప్రధాన లక్ష్యంతో మన జగనన్న ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర అనే క్రీడా పోటీలను గ్రామీణ,వార్డు, మండల,నియోజకవర్గ, రాష్ట్ర స్థాయిలలో డిసెంబర్ 15వ తేది నుంచి ఫిబ్రవరి 3వ తేది వరకు ఎంపిక చేసిన ఐదు క్రీడాంశాలు పోటీ క్రీడలు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీ లేని క్రీడలు యోగా, టెన్నికాయిట్, మారథాన్ క్రీడలను నిర్వహించబడుతుందని తిరుపతి జిల్లా కలెక్టర్, చైర్మన్ , డిఎస్‌ఏ కె. వెంకటరమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు 51 రోజుల పాటు తిరుపతి జిల్లాలోని 691 గ్రామ,వార్డు సచివాలయంలో మ్యాచ్‌లు నిర్వహించబడుతాయి. ఈ క్రీడా పోటీలు జరుగు విధానం, మొదటిగా గ్రామ, వార్డు స్థాయి పోటీలు నిర్వహించబడుతాయన్నారు. ఇందులో గెలుపొందిన జట్టు మండల స్థాయికి ఎంపిక కాబడతుంది, మండల స్థాయి గెలుపొందిన జట్టు నియోజకవర్గ స్థాయికి, నియోజకవర్గ స్థాయికి గెలుపొందిన జట్టు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక అవుతారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో గెలుపొందిన నగదు బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. 15 సంవత్సరాలు వయసు పై బడిన పురుషులు, మహిళలు మీకు సమీపంలో ఉన్న సచివాలయంలో నమోదు చేసుకోవచ్చునన్నారు. వెబ్ సైట్ నందు కూడా నమోదు చేసుకోగలరని తెలిపారు. నమోదు కోసం 1902నంబర్‌కి కాల్ చేయవచ్చునని జిల్లా కలెక్టర్, చైర్మన్, డిఎస్‌ఏ తెలిపారు.

## తిరుచ్చి వాహనంపై "దేవేరులతో శ్రీకృష్ణుడు"



చంద్రగిరి, నవంబర్ 28 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకుని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కె.ఎస్.రాజు, అధ్యాప రవిచంద్రన్, పరిచారిక ఘనాపాటి తిరువెంగడం, కెఎస్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థినులు చరిత్ర సృష్టించాలి : మంత్రి ఆర్కే రోజా

### శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో పూర్వ విద్యార్థినుల సమ్మేళనం



మంత్రి ఆర్కె రోజాను సన్మానిస్తున్న దృశ్యం

తిరుపతి (క్రీడా), నవంబర్ 28, ప్రభాతవార్త

విద్యార్థినులు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా ధైర్యంగా ముందడుగు వేసి అనుకున్న రంగంలో రాణించి చరిత్ర సృష్టించాలని రాష్ట్ర మంత్రి వర్యులు ఆర్కె రోజా పిలుపునిచ్చారు. తిరుపతిలోని టిటిడికి చెందిన శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో మంగళవారం వార్షిక పూర్వవిద్యార్థినుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల పూర్వ విద్యార్థిని, రాష్ట్ర మంత్రి ఆర్కె రోజా విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగిస్తూ శ్రీవారి పాదాల చెంతగల ఈకళాశాలలో చదువుకోవడం విద్యార్థినుల పూర్వ జన్మ సుకృతమన్నారు. దాదాపు మూడు దశాబ్దాల తరువాత తిరిగి కళాశాలలో తన గురువులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా విద్యను ప్రోత్సహిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దాన్ని సాధించేందుకు అహర్నిశలు శ్రమించాలన్నారు. అనుకున్న స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తాను ఈ స్థాయికి రావడానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు.

మరో పూర్వ విద్యార్థి, తిరుపతికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కృష్ణప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థినులను ఏకాగ్రత ముఖ్యమని, దాన్ని పెంపొందించుకుంటే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. కళాశాల విశ్రాంత తెలుగు విభాగాధిపతి డా. డిఎం ప్రేమావతి మాట్లాడుతూ 70 ఏళ్ల అపూర్వమైన చరిత్ర కళాశాల సొంతమని, వేలాది మంది విద్యార్థినులను విద్యావంతులుగా తీర్చిదిద్దిందని తెలిపారు. టిటిడి విద్యాశాఖాధికారి డా. ఎం. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో చదువుకున్న విద్యార్థినులు చాలా రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. కళాశాలకు ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిందని, అటానమస్ దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. మహదేవమ్మ, అల్యూమినీ ప్రెసిడెంట్ వసుధ, వార్డెన్ విద్యుల్లత, తెలుగు అధ్యాపకురాలు డా. కృష్ణవేణి, పూర్వ ప్రిన్సిపాల్ డా. స్వరాజ్యలక్ష్మి, ఇతర అధ్యాపకులు, పూర్వవిద్యార్థినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గుంతలమయమైన గాజులపల్లె-సరకల్లు రోడ్డు


### -అవస్థలు పడుతున్న ప్రయాణీకులు



తవణంపల్లె, నవంబర్ 28 ప్రభాతవార్త:

మండలంలోని గాజులపల్లె-సరకల్లు రోడ్డు పూర్తిగా గుంతలమయమై పోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాజులపల్లె నుండి సరకల్లు వరకు వున్న సుమారు 10 కిలోమీటర్లు బిటీ రోడ్డు గత కొంత కాలంగా గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. ఈరోడ్డు గుండా సరకల్లు, జి.గొల్లపల్లె, వెంగంపల్లె బస్సులతో పాటు విద్యాసంస్థల బస్సులు, వివిధ రకాల వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. దీనితో గుంతలమయమైన ఈరోడ్డులో ప్రయాణించాలంటే వాహన దారులు సాహసించాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు పలు ప్రాంతాలలో పూర్తిగా గుంతలు పడిపోవడంతో తరచూ వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలు సాగే రోడ్డులో గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి గుంతల మయమైన ఈరోడ్డును మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

## స్వర్ణమ్మకు జలకళ



శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని పవిత్ర స్వర్ణముఖినదికి జలకళ సంతరించుకుంది. డిసెంబర్ 12వ తేదీన కార్తీక మాసం సందర్భంగా పవిత్ర స్వర్ణముఖినదికి హారతుల కార్యక్రమాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో నిర్వహిస్తున్నారు. ఈనేపధ్యంలో గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా నదిలో నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షం ఎక్కువగా కురవడంతో స్వర్ణమ్మ నదిలో నీరు ప్రవహించడంతో భక్తులు సంబరపడుతున్నారు. నదీ హారతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఇప్పటికే స్వర్ణమ్మ హారతులకు సంబందించి ఏర్పాట్లును దేవస్థానం ఆధ్వర్యంలో ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, ఇఓ కెఎస్.రామారావు పర్యవేక్షిస్తున్నారు.

## చెర్లోపల్లి సచివాలయాన్ని జడ్పి సిఇఓ ఆకస్మిక తనిఖీ

తిరుపతిరూరల్, నవంబర్28 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ చెర్లోపల్లి గ్రామ సచివాలయాన్ని జడ్పి సిఇఓ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసారు. సచివాలయ రికార్డులను, రిజిస్టర్స్‌ను పరిశీలించారు. 'మా నమ్మకం-నువ్వే జగనన్న' డిస్‌ప్లే బోర్డు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఆడుదాం ఆంధ్ర, కుల గణన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయుటకు తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్దిదారులకు సవివరంగా అర్థమయ్యేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు జవాబుదారీతనం పని చేయాలని సూచించారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

## నేడు విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో అక్షింతల పంపిణీ



గూడూరు, నవంబర్ 28, ప్రభాతవార్త

కలియుగాబ్ధి 5125, పుష్య శుక్ల ద్వాదశి, సోమవారం, శాలివాహన శకం 1945, 22 జనవరి 2024వ తేది అయోధ్య శ్రీరామ జన్మభూమిలో నిర్మిస్తున్న నూతన మందిరంలో బాలరాముని నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేయబడుతున్న సందర్భంగా అయోధ్యలో జరగనున్న విగ్రహ ప్రతిష్ట కోసం అక్షంతలు హారతుల నడుమ వేద పండితులతో ఏర్పాటు చేసిన అక్షంతల్ని మన ప్రాంతాలకి 5వ తేదిన అయోధ్యలో వితరణ చేయడం జరిగింది. 16వ తారీఖున అని జిల్లాలకు వితరణ కార్యక్రమం చేయడం ప్రతి జిల్లాలో కూడా ఈ అక్షింతలు వారి వారి జిల్లా గుడిలో ఇవ్వడం ఇచ్చిన తర్వాత ప్రతిరోజు అక్షింతలకు పూజలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే గూడూరులో కూడా 16వ తారీఖు నుంచి నాద స్వామి గుడిలో వాటికి పూజలు చేస్తూ గర్భగుడిలో ఉంచి వాటిని గూడూరులో వితరణ చేస్తున్నాం, వారికి సంబంధించిన గూడూరు కార్యకర్తలు ఈ నెల 29న వచ్చి వాటిని తీసుకుని వారి యొక్క కేంద్రాలకు వెళ్తారని ఈ సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు స్వామి గుడికి ప్రతి ఒక్కరు కూడా హాజరై అక్కడ నుంచి శ్రీరాముల వారి గుడి వరకు ఊరేగింపుగా వెళ్లి ఊరేగింపులో ప్రతి ఒక్కరు గూడూరులోని ప్రజలు ప్రముఖులందరూ కూడా ప్రతి ఒక్క హిందువు కూడా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టగా తీసుకుని అందరూ కూడా పాల్గొనాలని విశ్వవిందు పరిషత్ అధ్యక్షుడు మురళి రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమణయ్య, కోశాధికారి రవిచంద్ర, పట్టణ ప్రచారంకు ఆర్‌వి రావు, సేవా ప్రముఖులు రాజగోపాల్ రెడ్డి, ఏబీవీపీ చిన్న పాల్గొన్నారు.

# స్పటికలింగ దర్శనం పరమపవిత్రం

### -శివయ్య ఆలయంలో ప్రత్యేక ఆకర్షణ

శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో వెలసిన పవిత్ర ఆలయంలో ఎన్నో మానవుడు ఆచరించాల్సిన జీవిత రహస్యాలు భావి తరాలకు అందించుటకు నిర్మితమైందని చెప్పవచ్చు. స్వయంభువుగా వెలసిన ఈ క్షే త్రంలో లింగాకారాన్ని పరిశీలిస్తే పైన ఐదు శిరస్సుల నాగ పడగ కనబడుతోంది. దీనినిరాహువు అంటారు. అలాగే అమ్మవారి వడ్డాణంలో కేతువును ధరించి ఉండటం వల్ల దీనిని రాహుకేతు క్షేత్రమనిఅంటారు. దివ్యక్షేత్రం పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభుగా వెలసిన క్షేత్రంగానే ప్రసిద్ధి చెందింది. 1994నుంచి వేదపండితులు ఈ దివ్యక్షేత్రం రాహుకేతువులకు నిలయమంటూ ప్రచారం చేసారు.దాంతో ఈ క్షేత్రం స్వరూపం మారింది. పంచభూత లింగాల్లో వాయు లింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన క్షేత్రం మాట అటుంచి నేడు రాహుకుతు దోష నివారణ క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది.అయితే ఈ దివ్యక్షేత్రానికి వచ్చిన వారు బిక్షాల గాలిగోపురం నుంచి ప్రవేశిస్తే ఎన్నో మహిమాన్వితాలను తిలకించవచ్చు. మానవుడు ఆచరిం చాల్సిన నాలుగుసూత్రాలకు అనుగుణంగా నిర్మించిన క్షేత్రంను పరిశీలిస్తే 'కేశోపనిషత్తు'ను ఒక కసారి గుర్తుకు తెస్తోంది, నాలుగు మార్గాలను అలా ఏర్పాటు చేసారు. అయితే ఇక్కడి ఆలయంలోనికి బిక్షాల గోపురం నుంచి ప్రవేశిస్తే మొదట బాలజ్ఞానాంబిక గోపురం పక్కనే అలయం ఉంటుంది. అటు పక్కనే సుబ్రమణ్యం స్వామి ఆలయం ఉంది. కాగా కొద్దిగా ముందుకువస్తే 'పాతాళ వినాయకుడు' వెలసి ఉన్నాడు.ఈ ఆలయాన్ని తమిళనాడుకు చెందిన భక్తులు విశేషంగా దర్శించుకుంటారు. గంటల తరబడి స్వామి దర్శనానికి నిరీక్షిస్తారు.

**శివానందైక నిలయం:**

ఈ దివ్యక్షేత్రాన్ని శివానందైక నిలయమని పిలుస్తారు. ఇక్కడ



ఆలయానికి సమీపంలో కైలాసగిరి పర్వత పంక్తుల్లో బ్రహ్మగుడి వెలసి ఉంది. మరే ఇతర శైవ క్షేత్రాల్లో బ్రహ్మగుడి ప్రత్యేకంగా ఉన్నట్లు మనం గమనించమని ఇక్కడి పెద్దలు చెబుతారు. స్థానికంగా ఉన్న ఆధారాలను బట్టి పరమేశ్వరానుగ్రహంతో సర్వశక్తులు,సమస్తవిద్యలు సృష్టికర్త బ్రహ్మ నేర్చుకున్నారు. బ్రహ్మ శివనామస్మరణ మాని గర్వంతో విర్రవీగుతున్న గమనించిన ఆకాశవాణి వారించి విధాత గతలంఓ నీవు ఆ పరమేశ్వరుణ్ణి పూజించి నీభక్తి తర్పనతో ఆతణ్ణి మెప్పించి సకల విద్యలు సర్వ శక్తులు పొంది సృష్టి కర్తవయ్యావు. ఇప్పుడు అదంతా నీ ప్రతిబనని గర్వించి పరమేశ్వరుణ్ణి ధిక్కరించి శివ క్రోధానికి పాల్పడ్డావు.ఈ పాప నివృత్తి కోసం నీవు కైలాసానికేగి, శివుని గురించి తపస్సు చేయాలని లేకుంటే శివుని అగ్రహానికి గురికావాల్సి వస్తోందని హెచ్చరించినట్లు చెబుతారు. తన తప్పిదాన్ని తెలుసుకున్న బ్రహ్మ కైలాసానికేగి శివుని గురించి తపస్సు చేయనారంభించారు. భక్తవత్సలుడైన భోళాశంకరుడు బ్రహ్మ తపస్సుకు సంతశించి సాక్షాత్కరించి అహంకారంతో నీవు నీ శక్తుల్ని కోల్ప్రయావు.తిరిగి నీవు నీ శక్తి సామర్ధ్యాలను పొందాలంటే నిరహంకారివై నా గురించి తపమాచరించు అని చెప్పగా బ్రహ్మ సంతోషించి తాను ఎక్కడ తపస్సు చేయాలని శివుని ప్రశ్నించగా 'ఈ కైలాసగిరులలో నా ముఖ పంచకానికి ప్రతీకలుగా వెలయుచున్న శివానందైక నిలయ పర్వతాన్ని భూలోకంలో స్థాపించి ఆపర్వత సానువులలో తపమాచరించు అని దాంతోనీవు చేసిన పితృ, గురు, శివద్రోహం తొలగిపోయి తిరిగి సృష్టి సామర్థ్యాన్ని పొందగలవని'సూచించినట్లు స్థానికులు చెబుతారు.దాంతోబ్రహ్మ కాశీ క్షేత్రంలోప్రవేశించి పర్వతాన్ని ఎక్కడ ప్రతిష్టించాలో తెలియని సందిగ్ధంలో ఉండగా ఆశరీరవాణి దక్షిణ దిశగా ప్రయాణించు నీ భూజాలపై నున్న పర్వతం పెనుభారమై దుర్భరమైనా నీకు తెలియకుండా భూపతనం చెందుతుంది! నీవు ఆ పర్వతాన్ని ఎత్తాలనిఎంత ప్రయత్నించినా అది ఫలించదు. అదే నీ తపస్సుకు అనువైన ప్రదేశంగా భావించి అక్కడ నీ తపస్సును కొనసాగించమని తెలియజేసినట్లు అప్పుడు బ్రహ్మ వారణాసికి దక్షిణ దిశగా శ్రీశైల శిఖరాలను దాటి శ్రీకాళహస్తి వద్దకు వచ్చినపుడు అశరీరవాణి వాక్కులు ఫలించినట్లు అప్పుడు బ్రహ్మ ఇక్కడే తన తపస్సుకు అనువైన స్థలంగాభావించి ఇక్కడే తప్పస్సు చేసి తనశాప విమోచనం పొందినట్లు చెబుతారు.బ్రహ్మ తపస్సు చేసిన పుణ్య పర్వతమే దక్షిణ కైలాసగిరులని ప్రతీతి.అప్పటిలో ఈ క్షేత్రాన్ని బ్రహ్మపురం అని ప్రసిద్ధి చెందినట్లు స్థల పుస్తకాల్లో ఉన్నటు చెబుతారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మహాత్మా పూలేకు ఘన నివాళులు



కుప్పంరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త

బడుగు,బలహీనవర్గాల అభ్యున్నతికి పోరాటం చేసిన మహాత్మా జ్యోతిరావ్ పూలే 198 వర్ధంతిని తెదేపా బిసి సెల్ అధ్వర్యంలో వడ్డిపల్లిలో ఘనంగా నిర్వహించారు.పూలే చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈసందర ్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ మహాత్మా పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు జెఎంసి మురళి, రాష్ట్ర నేతలు గోపీనాథ్, వైద్యం శాంతారాం, కాణిపాకం వెంకటేష్, నేతలు సాంబశివం,ఆర్ముగం, మణి, సురేష్‌కుమార్, జెకె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల బూత్ మార్పులపై ఆర్డీఓకు ఫిర్యాదు

కుప్పం, నవంబర్ 28 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధి 175,176,177వ బూత్‌ల పరిధిలోని తపాలరాజ వీధి, నారాయణస్వామి వీధిలో ఉన్న ఓటర్లను కొత్తపేట బూత్‌లకు మార్చినట్లు తెదేపా నేతలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. అలాగే కొత్తపేటలో ఉన్న 176,177బూత్‌ల ఓటర్లను తపాలరాజవీధి, నారాయణస్వామి వీధికి మార్చడం జరిగిందని ఓటర్ల జాబితాను ఆర్డీఓకు చూపించారు. దీంతో ఓటర్లకు తీవ్ర సమస్యలు ఎదురవుతాయని ఆర్డీఒకు వివరించారు. ఎక్కడి ఓట్లను ఆయా బూత్‌ల పరిధిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఒను కోరారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ విషయాన్ని ఎన్నికల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తగు ఆదేశాలు రాగానే ఎక్కడి ఓట్లు ఆయా బూత్‌లలో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తెదేపా యూనిట్ సభ్యులు ఆర్ఆర్ రవి, ముఖేష్ (అప్పు), బూత్ కన్వీనర్లు మంజునాథ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా పూలే వర్ధంతి.. నివాళులు



శాంతిపురం, నవంబర్ 28 ప్రభాతవార్త

మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్ధంతిని స్థానిక తెదేపా కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి పూజలు చేశారు. పూలే సేవలను మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, నాగరాజు, మణి, మునెప్ప, రమేష్, గోవిందరాజులు, సింగిరి శ్రీనివాసులు, పెద్దన్న,కేశవులు, వెంకటేష్, చంద్రశేఖర్, చంద్రకళ పాల్గొన్నారు.

## ఓటరు నమోదుపై అవగాహన అవసరం : తహాశీల్ధార్



వెదురుకుప్పం, నవంబర్ 28 ప్రభాతవార్త :

ఓటర్లు నమోదు ప్రక్రియ పై విద్యార్ధులకు అవగాహన అవసరమని ఇన్‌చార్జీ తహాశీల్దార్ జయంత్ కుమార్ పేర్కొన్నారు. మండలంలో ని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓటరు నమోదు పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుబలమైన శక్తి అని ప్రభుత్వాల ఏర్పాటులో ఓటరు కీలక పాత్ర నిర్వహిస్తారని విద్యార్ధి దశలో తెలుసుకోవాలన్నారు. మీరు ఓటు హక్కు గురించి తెలుసుకుని దాని విలువ ప్రాధాన్యతను గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కును ఏలా నమోదు చేసుకోవాలి అనే అంశంను వివరించారు. అర్హులైన విద్యార్దులు ఓటరుగా నమోదును ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్ధార్ కోమల, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద, అధ్యాపకులు, విద్యర్ధులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పిల్లలకు స్టీల్ వాటర్ బాటిల్స్‌వితరణ



చిత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త:

చిత్తూరు పట్టణం, సంజయ్‌నగర్ కాలనీలోని గల ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ స్కూల్ విద్యార్ధులకు జిజెఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవుల నాయుడు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేసారు. మహాత్మా శ్రీ జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని 100మంది పిల్లలకు వాటర్ బాటిల్స్ వితరణ చేయడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యువరాజులునాయుడు, తెలుగుదేశం నాయకులు గౌస్‌భాషా, మౌలిక, మదనతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేపు పివికెయన్ ప్రభుత్వ కళాశాలలో జాబ్ డ్రైవ్

చిత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త:

పట్టణంలోని పివికెయన్ ప్రభుత్వ కళాశాల నందు ఈనెల 30వ తేది ఉదయం 10గంటలకు జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.జీవనజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌డ్రైవ్‌లో హాలోజోన్ మేనేజ్మెటర్ సర్వీసెస్, అపోలో ఫార్మసీ కంపెనీలు పాల్గొని, 460 ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కనీస విద్యార్హత పదవతరగతి, ఇంటర్, బిఫార్మసి, ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఏదైనా డిగ్రీ పాస్/ఫెయిల్ కలిగి వుండి 18-30 వయస్సుకలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో పాటు 4ఫోటోలు,ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలు, బయోడేటాతో హాజరుకావాలని సూచించారు.

## కురబసంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బాలకృష్ణ

వి.కోట, నవంబర్ 28 ప్రభాతవార్త



మండల కురబ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా దొడ్డిపల్లి బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసులుగౌడు, ఉపాధ్యక్షుడిగా కృష్ణప్ప, కార్యదర్శి ఉమాపతి, సహాయ కార్యదర్శిగా నాగరాజు, సభ్యులుగా పవన్‌కుమార్, వెంకటేష్,బాలు, గంగోజప్పలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ కురబకులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని, కనకదాస విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

## బాల్య వివాహం సాంఘీక దురాచారం

చౌడేపల్లి, నవంబర్ 28 ప్రభాతవార్త



బాల్య వివాహం సాంఘీక దురాచారమని బాలికా, శిశుసంక్షేమ సంస్థ ప్రతినిధి రేణుకాభాయి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, ఎయిడ్స్‌వ్యాధి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్న వయస్సులోనే ప్రేమ, పెళ్ళి జోలిక పోకుండా విద్యపట్ల ఆసక్తి కనబరచాలన్నారు. అనంతరం సమాజంలో బాలికలు, మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, నిర్మూలనా మార్గాలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ ప్రభావతి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణాధికారి బాలాజీ, అధ్యాపకులు, స్థానికులు పాల్గొన్నారు.

## కర్నాటక మద్యం స్వాధీనం - ఒకరి అరెస్టు

బంగారుపాళ్యం, నవంబర్ 28 ప్రభాతవార్త:



మండలంలోని గుంతూరు గ్రామ సమీపం వద్ద కర్నాటక మద్యం విక్రయిస్తూ ఒక వ్యక్తి పట్టుబడినట్లు ఎక్సైజ్ ఎస్ఐ మోహన్ బాబు తెలిపారు. గుంతూరు హరిజనవాడకు చెందిన తిరుమలేశ్(28) మూడు అట్ట బాక్సుల్లో కర్నాటక మద్యం విక్రయించడానికి సిద్ధంగా వున్నాడు. అందిన సమాచారం మేరకు పోలీసులు తిరుమలేష్‌ను పట్టుకొని విచారించగా గ్రామంకు చెందిన సుకుమార్ కర్నాటక నంగిలిలో మద్యం కొనుగోలు చేసినట్లు చెప్పాడు, పట్టబట్ట మద్యంను స్వాధీనం చేసుకొని తిరుమలేష్‌ను అరెస్టు చేశారు. అలాగే సుకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఇంటలిజెన్స్ ఎస్ఐ పృథ్వీ, ఇతర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ

చిత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉషానగర్ భజన మండలి సత్యసాయి సేవా సమితి బాలవికాస్ సీనియర్ గురువులు అనురాధ, పాండురంగంలు రెడిమేడ్ వస్త్రాలను అందజేసారు. ఈ సేవలో చిత్తూరు జిల్లా అధ్యక్షులు మధుసూదనం, ఉష నగర్ భజన మండలి కన్వీనర్ ప్రభాకర్‌నాయుడు, భజన మండలి వ్యవస్థాపకులు సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో రోడ్డు గుంతలు పూడ్చివేత

శాంతిపురం, నవంబర్ 28 ప్రభాతవార్త



మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల వద్ద రోడ్డు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. దీంతో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కందస్వామి తన సొంత నిధులతో జెసిబి ద్వారా రోడ్డులో గుంతలు పూడ్పించి రోడ్డును బాగు చేయించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే

గూడూరు, నవంబర్ 28, ప్రభాతవార్త



మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ నివాళులు అర్పించారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు కృషి చేసిన మహాపురుషుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక పాత బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకర్త సంఘసేవకుడు, సామాజిక తత్వవేత్త, మహిళా అభ్యుదయ వాది. నిరంతరం మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలేను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బొమ్మిడి శ్రీనివాసులు, నాయకులు నల్లపురెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, ఓడూరు బాలకృష్ణారెడ్డి, బత్తిన విజయ్ కుమార్, యారం వెంకటసుబ్బయ్య, నర్మల రమణయ్య, ఉలవకాయల ప్రసాదు, శ్రీరామ్ గురుస్వామి, మల్లీ శ్రీనివాసులు ,వంకా రమణయ్య, గపూర్ బాయ్, మహేంద్ర, మోబిన్ భాష, కనుమూరు జగదీష్, ఎంపులూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గోడ పత్రికలు ఆవిష్కరణ



గూడూరు, నవంబర్ 28, ప్రభాతవార్త

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎబివిపి గూడూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక స్వర్ణాంధ్రభారతి కళాశాలలో ఎబివిపి 69వ జాతీయ మహాసభలకు సంబంధించి గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబివిపి తిరుపతి జిల్లా కన్వీనర్ సన్నీ మాట్లాడుతూ డిసెంబర్ 7 నుంచి 10వ తేదీలలో ఈ దేశ రాజధాని ఢిల్లీ మహానగరంలో జరుగుతున్న 69వ జాతీయ మహాసభలు ఎంతో ప్రత్యేకం అని ఎబివిపి స్థాపించి 75 సంవత్సరాలు అయిన ఈ సందర్భంలో దేశ వ్యాప్తంగా అమృతోత్సవాల వేడుకలు నిర్వహించామని అన్నారు. ఈ జాతీయ మహాసభలలో దేశ విద్యా విధానం గురించి అలాగే రాష్ట్రంలో ఉన్న విద్యా వ్యవస్థ గురించి చర్చిస్తామని అన్నారు. ఈ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం స్వర్ణాంధ్ర భారతి డైరెక్టర్ నిరంజన్, ప్రాంత ఎస్ఎఫ్ఎస్ కో కన్వీనర్ చిన్న, ఏబివిపి కార్యకర్తలు శివ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## బడుగు వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

### వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి, నవంబర్ 28, ప్రభాతవార్త




మహాత్మ జ్యోతిరావు పూలే పేద బడుగు వర్గాల ఆశాజ్యోతి అని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాం కుమార్ రెడ్డి తెలిపారు. జ్యోతి రావు పూలే 133వ వర్ధంతి సందర్భంగా వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే ఎనలేని సేవ చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరు పూలే అడుగుజాడల్లో నడవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ నక్క భానుప్రియ, వైస్ చైర్ పర్సన్ ఉమామహేశ్వరి, పద్మశాలు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వర రావు, పట్టణ కన్వీనర్ డిల్లీ బాబు, వైసిపి జిల్లా కార్యదర్శి హరికృష్ణ, కౌన్సిలర్లు గోపాలకృష్ణ, ధనియాలు రాధా, పూజారి లక్ష్మి, కళ్యాణి, శ్రీనివాసులు, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు మురళీకృష్ణ, ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావుపూలే

కోట, నవంబర్ 28 ప్రభాతవార్త

అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు కృషి చేసిన మహాపురుషుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎంపిడిఓ మార్లెల భవాని అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యమకర్త, సంఘసేవకుడు, మహిళా అభ్యుదయవాది, మహిళ విద్యాభివృద్ధికి కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలేను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజంలో అంటరానితనంపై పోరాటం చేసి వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్య అవకాశాలు కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి అంజమ్మ, వైసీపీ నాయకులు, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రామాపురంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే



తడ, నవంబర్ 28 ప్రభాతవార్త

తడ మండలం రామాపురం సచివాలయం వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఓ అమోస్‌బాబు మాట్లాడుతూ రామాపురంలో జరిగిన ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాల వివరాలను బోర్డు ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు కె.ఆర్ముగం, స్థానిక సర్పంచ్ టికె శ్రీనివాసన్, ఎంపిటిసి సుధాకర్, వైసీపీ నాయకులు రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి

### ఏడిఏ నాగార్జున సాగర్



వెంకటగిరి, నవంబర్ 28, ప్రభాతవార్త

ఆరుతడి పంటలే సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నాగార్జున సాగర్ తెలిపారు. వ్యవసాయ సంచాలకులు వారి కార్యాలయంలో వ్యవసాయ సహాయకులు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడిఏ ఎం. నాగార్జున సాగర్ మాట్లాడుతూ ప్రస్తుతం తక్కువ వర్షపాతం ఉండటం వలన డిసెంబర్ 15వ తేది వరకు చూసుకుని బోరు బావుల క్రింద నీటి సౌకర్యం ఉన్న దగ్గర వరి పంటకు బదులు ఆరుతడి పంటలైన పెసర రకములు ఐపిఎం 2 - 14 డబ్ల్యూజీ 42, మినుము రకముల టీ బిజీ 104, వేరుశెనగ రకములైన టీఏజీ 24, నువ్వులు రకం వైఎల్ఎం 11,17,66 రకములు సాగు చేసుకుని మంచి దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. అదే విధంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రాబోయే రబి సీజన్‌లో యూరియ, డిఏపిలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని మీకు దగ్గరలోనే ఆర్‌బికెలో విఏఏల ద్వారా తీసుకోగలరు అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి పి. సుజాత, ఏఈఓలు పాల్గొన్నారు.

## ఆక్రమణ భూములను ఇప్పించాలని తహాశీల్దార్‌కు వినతిపత్రం

వాకాడు, నవంబర్ 28, ప్రభాతవార్త

బాలాజీ బయోటెక్ దురాక్రమంలో ఉన్న సుమారు 200 ఎకరాలు భూములను పేదలకు ఇవ్వాలని మంగళవారం ఆ గ్రామస్తులు తహాశీల్దార్‌కు వినతి పత్రం అందజేసారు. వాకాడు మండలం జమీన్ కొత్తపాలెం పంచాయితీ పరిధిలోని పాతేటిపాలెం, వాగరు, అందలమాల, గ్రామ రెవెన్యూ నందు ప్రభుత్వ పొలాలు అసైన్డ్, సిజెఎఫ్ఎస్ భూములు, పాతేటిపాలెంలోని చెరువులు, దొరువులు, ప్రభుత్వ పొరంబోకులు కలిపి సుమారు 200 ఎకరాలు ప్రభుత్వ భూములు బాలాజీ బయోటెక్ కంపెనీ దురాక్రమణ చేసి సుమారు 30 సంవత్సరాల నుండి అనుభవిస్తూ, ప్రభుత్వంనకు ఎలాంటి రుసుము చెల్లించకుండా, ఎటువంటి అనుమతులు పొందకుండా, ఆ కంపెనీ అనుభవిస్తున్నారని, ప్రభుత్వ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలు ఎలాంటి జీవనాధారం లేకుండా నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

## ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయండి

కోట, నవంబర్ 28 ప్రభాతవార్త

కోట మండలంలో 15 సంవత్సరాలకు పైబడిన యువత క్రీడల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించడం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకునేందుకు వారికి మంచి అలవాట్లు అలవరచుకోవడంలో క్రీడల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ప్రధాన లక్ష్యంతో మన జగనన్న ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అనే క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మార్లెళ్ల భవాని చెప్పారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఎంపిక చేసిన ఐదు క్రీడ అంశాలు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లు నియోజకవర్గ స్థాయికి, నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన జట్లు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు రాష్ట్ర స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీలు, పతకాలు అందజేస్తారని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## భగవద్గీత పారాయణంలో విద్యార్థిని ప్రతిభ



శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త : భగవద్గీత జపించడం..ఆధ్యాత్మిక పర్వం అని తెలుపుతూ చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో గత నెలలో భగవద్గీత పారాయణం పోటీలను నిర్వహించారు. ఈపరీక్షల్లో విజేతలకు బహుమతులను అందించారు. ఇందులో పట్టణంలోని ఆక్స్ ఫర్డ్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న ఎం.ప్రవాసిని విద్యార్థినికి మొదటి బహుమతిని ప్రధానం చేశారు. ఈసందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

వార్తకు స్పందన

## శేషమనాయుడుకండ్రిగ ఎస్టీకాలనీకి నీటి సరఫరా



శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త : శేషమనాయుడుకండ్రిగ ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలకు త్రాగునీటి సమస్యలు ఉందని తెలుసుకున్న జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భరత్‌రెడ్డి వారి దాహార్తిని తీర్చారు. శేషమనాయుడుకండ్రిగ ఎస్టీ కాలనీలో సుమారు 20కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. వీరు గత ఏళ్ళ తరబడి నీటిని వాడుకోవడానికి సమీపంలోని పంటపొలాల్లో ఉన్న బోర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. అయితే ఇక్కడ బోరు వేస్తే మురుగునీరు కలవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.దీంతో పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో స్పందించిన భరత్‌రెడ్డి కాలనీ వాసులకు వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీటిని అందించి వారి సమస్యను తీర్చారు. ఈసందర్భంగా కాలనీ వాసులు భరత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. భరత్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసుల సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు.

## సభ్యుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి : ఎంపీపీ మునివేలు



పుత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త: సభ్యుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ మునివేలు పేర్కొన్నారు. పుత్తూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఆమె అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి రోజా నేతృత్వంలో మండలంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని ఆమె తెలియజేశారు. ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో అన్ని శాఖల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాఖల వారిగా వారి ప్రగతి నివేదికలను తెలియజేశారు. తహసీల్దార్ పరమేశ్వరస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2003 ముందు అందించిన డీకేటీ పట్టాలకు శాశ్వత భూమి హక్కు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. త్వరలోనే శాశ్వత భూమి హక్కు పట్టాలను అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులందరూ చేసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారి కోదండయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా ద్వారా రైతులకు ఆర్థిక భరోసాను కల్పిస్తోందని తెలిపారు. సమావేశంలో ఉద్యనాధికారిణి వెంకట సౌజన్య, ఏపీవో భార్గవి, ఏపీఎం డి.వి.సుబ్బారెడ్డి, సీడీపీవో పద్మజ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## నేడు ఎస్వీయూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం

తిరుపతి (క్రిడా), నవంబర్ 28 ప్రభాతవార్త : ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖ పక్షాన ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం ఈ నెల 29వ తేది బుధవారం నిర్వహించనున్నారు. ఆచార్య జాస్తి సూర్య నారాయణ పేరుతో ఈ ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం చేపట్టనున్నారు. సంస్కృత సాహిత్యం ఉత్తర రామచరిత వైశిష్ట్యం అనే అంశంపై జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు కొంపెల్ల రామ సూర్య నారాయణ ప్రసంగిస్తారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీఎం సుందరవల్లి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సాహిత్యవేత్తలు, విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ తెలిపారు.

## గణనాథుని సన్నిధిలో పూతలపట్టు ఎమ్మెల్యే



కాణిపాకం, నవంబర్ 28 ప్రభాతవార్త: పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు వేద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి,టెంపుల్ ఇన్స్ పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాణిపాకంలో బాల బ్రహ్మానంద సరస్వతి ప్రవచనం

కాణిపాకం, నవంబర్ 28 ప్రబాతవార్త: ప్రముఖ ప్రవచనకర్త బాల బ్రహ్మానంద సరస్వతి వైషిమారణ్యాం పీఠం, హిందూ ధార్మిక సేవాసమితి ఇచ్ఛాపురం వారిచే బుధవారం ధార్మిక ప్రవచనాలు వుంటుందని ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈప్రవచన కార్యక్రమంకు భక్తులు, ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొనాలని తెలిపారు.

**రేపు సంకటహర చతుర్థి వత్రం :**

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం సంకటహర గణపతివ్రతంను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. ఈమేరకు ప్రతినెలా పౌర్ణమి అనంతరం వచ్చే చతుర్థి రోజున ఈవ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు బుధవారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు జరిగే ఈవ్రతంలో భక్తులు 350 రూపాయలు టిక్కెట్ చెల్లించి గోత్రనామాలతో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.అలాగే సాయంత్రం స్వామివారికి స్వర్ధరథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు.

# టీచర్లను వేధించ వద్దు : ఆపస్



పుత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త: చిన్న చిన్న కారణాలతో టీచర్లను వేధించ వద్దని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. పుత్తూరులో మంగళవారం ఆపస్ బాధ్యులచే ఎన్నుకున్న వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటు పుస్తకాలను దిద్దలేదని, వర్క్‌బుక్స్ రాయించలేదని, బైజూస్ యాప్ వాడలేదని, ప్రశ్నాపత్రాన్ని సరిగా మూల్యాంకనం చేయలేదని ఇంకా చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు, చార్జి మెమోలు, సస్పెన్షన్లు చేసి వేధించడం సరికాదని ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలోపని చేసే విధంగా వారికి స్వేచ్ఛని ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర కార్య నిర్వాహక వర్గ సమావేశంలో శవన్నగారి బాలాజీని రాష్ట్ర అధ్యక్షులుగా, గంగరాజు దొరస్వామిని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్న సందర్భంగా పుత్తూరులో మంగళవారం ఆపస్ బాధ్యులచే వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులుగా నిరంతరం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎల్లప్పుడూ తెలుపుకుంటూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తానని తెలిపారు. డీపీఎస్ రద్దు పాత పెన్షన్ అమలు, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ స్కీమ్, ఆర్థిక బకాయిల చెల్లింపు, ఉమ్మడి సర్వీసు రూరల్స్ సాధన, తదితర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయ్, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, తేజోమూర్తి, ధనంజయులు, తులసిరాం, దశరథ్, గుర్రప్ప, లోకేష్, చక్రపాణి, జయకర్, మనోజ్, గిరి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## దూదేకులను మైనార్టీలుగా గుర్తించండి

**-కలెక్టర్‌ను కొరిన దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లీ**



తిరుపతిరూరల్, నవంబర్28 ప్రభాతవార్త: కులగణలో దూదేక కులస్తులను ముస్లిం మైనార్టీలుగా గుర్తించాలని నూర్‌భాష దూదేకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కరమల్ల వల్లీ డిమాండ్ చేసారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా కరమల్ల వల్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో నూర్‌భాష దూదేకుల కులస్తులు రిజర్వేషన్ పరంగా బిసి-బిలోను, సీరియల్ నెంబర్ 5గా నమాదు కాబడి ఉందని తెలిపారు. మైనార్టీలకు మాత్రమే ఇచ్చే దుల్హన్ పథకం ఈ మధ్యకాలంలో షాదీతోఫా లాంటి పథకాలు కూడా ప్రభుత్వం దూదేకులు, నూర్ భాషలకు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసారు. నిరక్ష్యరాశులు ఉన్న దూదేకులకు అవగాహన లేమి కారణంగా మతంపై స్పష్టత లేదన్నారు. కుల గణలో అధికారులు స్పందించి దూదేకులను మైనార్టీలుగా గుర్తించాలని కోరారు.

## స్విమ్స్ హాస్పిటల్‌తో పలు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీల ఒప్పందం

తిరుపతి టౌన్, నవంబర్ 28 ప్రభాతవార్త : స్విమ్స్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీల భాగస్వామ్యంతో సేవలను మరింత విస్తరించేందుకు ప్రణాళికను రూపొందించుకుంది. ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించేందుకు ఇన్సూరెన్స్ నెట్ వర్క్ హాస్పిటల్‌గా స్విమ్స్‌ను నమోదు చేసుకుంది. హెల్త్ ఇన్సూరెన్స్ వున్న రోగులకు స్విమ్స్ నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకుని వచ్చారు. 18 హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలతో స్విమ్స్ ఒప్పందం కుదుర్చుకుంది. మరికొన్ని సంస్థలతో కూడా హెల్త్ ఇన్సూరెన్స్, నగదు రహిత వైద్య సేవలను అందించడానికి స్విమ్స్ వారు ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రాము తెలిపారు.

## జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



తిరుపతి టౌన్, నవంబర్ 28 ప్రభాతవార్త : భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన గురువుగా జ్యోతిరావు పూలే అని అన్నారు. మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బీసీ సంఘ నాయకులు స్థానిక బాలాజీ కాలనీ కూడలిలోని విగ్రహానికి పూలమాల వేసి ఆయనకు నివాళులు అర్పించారు. బీసీల కోసం ఎన్నో త్యాగాలు చేసినటువంటి మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి జరుపుకోవడం నేటి యువత బిసి నాయకులు అందరూ ఆయన బాటలో నడిచి మంచి సమాజం తేవాలని కోరారు. నేడు సిఎం జగన్మోహన్ రెడ్డి అభినవ పూలేగా బిసిలకు ఉన్నత స్థానం కల్పించి అందరి మన్నలను పొందారు. ఆయన్ని మరోసారి సిఎం చేసుకోవాలని ప్రజలను కోరారు.

## భూ పరిహారానికి దరఖాస్తుల ఆహ్వానం

**హక్కు పత్రాలను తహాశీల్దార్‌కు సమర్పించండి..! తహాశీల్దార్ శిరీషా**

చంద్రగిరి, నవంబర్ 28 ప్రభాతవార్త: మండల పరిధిలోని రైతులు భూ పరిహారానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తహాశీల్దార్ శిరీషా తెలిపారు. చంద్రగిరి మండల పరిధిలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌చే కేంద్ర ప్రభుత్వ 3డి నోటిఫికేషన్ ద్వారా నేషనల్ (ఎన్‌హెచ్) 140 కుక్కపల్లి - మల్లవరం 6 వరుసల రోడ్డు నిమిత్తం గతంలో భూ సేకరణ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భూములు కోల్పోయిన భూ యజమానులకు నష్టపరిహారం అందజేసినట్లు తెలిపారు. అయితే ఇందులో కొంత మంది భూ యజమానులు నష్టపరిహారం తీసుకోలేదని అన్నారు. భూములు కోల్పోయిన యజమానులు తగిన హక్కు పత్రాలను రెవెన్యూ కార్యాలయంలో తహాశీల్దార్‌కు అందజేసి 15 రోజులలో పరిహారం తీసుకోవాలని కోరారు. నష్ట పరిహారం తీసుకోని యెడల ఎన్‌హెచ్ యాక్ట్ 1956 ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

## అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి జ్యోతీరావ్ పూలే

**బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్ రావు**



తిరుపతి టౌన్, నవంబర్ 28 ప్రభాతవార్త : అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి అని జ్యోతీరావ్ పూలే బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్ రావు తెలిపారు. మంగళవారం జ్యోతిరావ్ పూలే 133వ వర్ధంతి సందర్భంగా బాలాజీ కాలనీలోని జ్యోతిరావ్ పూలేకి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈడిగ కార్పొరేషన్ ఛైర్మన్ శాంతికుమారి, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమార్, రాయలసీమ కన్వీనర్ జ్ఞానజగదీష్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు మధు ఆచారి, రాయలసీమ విద్యార్థి నేత వాసు, జయచంద్ర, బిసి నేతలు పాల్గొన్నారు.

## పూలే దార్శనికత ఆదర్శనీయం..తెదేపా




శ్రీకాళహస్తి, జనవరి 28 ప్రభాతవార్త : ఆధునిక భారతదేశ చరిత్రలో తొలితరం సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర సమర యోధునిగా, ఉపాధ్యాయుడిగా విశేష సేవలందించిన భారతీయ సమాజంలోని సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి కృషిచేసిన మహాత్మా జ్యోతిబాపూలే దార్శనితక ప్రతి ఒక్కరు ఆచరించదగ్గదని తెలుగుదేశంపార్టీ బిసి విభాగం నియోజకవర్గ నాయకులు పేర్కొన్నారు. స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలోబిసి విభాగంనాయకులు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అమలు చేసిన వంద సంక్షేమ పథకాలను రద్దుచ ఏసి రూ.34వేల కోట్లు బిసి నిధులను దారి మళ్ళించిన వైఎస్ జగన్ బిసి ద్రోహిగా చరిత్రలో నిలచిపోతారన్నారు. స్థానిక సంస్థల్లో 10శాతం రిజర్వేషన్ల కోత కోసి సుమారు 16,800 రాజ్యాంగ బద్ధ పదవులను బిసిలకు దూరం చేసి బిసిల అసైన్డ్ భూములు 8వేల ఎకరాలు బలవంతంగా స్వాధీనం చేసుకున్న ద్రోహి జగన్ అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.రేణుకాదేవి, వన్నెకులక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుబుజ్జి, టిఎన్ఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, బిసి విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజయాదవ్, తిరుపతి పార్లమెంటు కార్యదర్శులు యంయస్‌రెడ్డి, అత్తిరాల భాస్కర్‌గౌడ్, బిసి విభాగం నాయకులు రామచంద్రయ్య, లోకేష్, బీమాల భాస్కర్, మణి, రావిళ్ళమునిరాజనాయుడు,, వెంకటేష్‌చౌదరి, కన్నలి ప్రతాప్‌రెడ్డి, పాండు, జిలానీ, అస్మత్, మహ్మద్, రఫి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయపార్టీనేతలతో ఆర్డీవో సమావేశం



తొట్టంబేడు, నవంబర్ 28 ప్రభాతవార్త : రాజకీయ పార్టీనేతలతో శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ముసాయిదా ఓటర్ల జాబితా 2024కు సంబందించి సమావేశం నిర్వహించారు. ఫారం 5, 6 మరియు ఓటర్ల మీద పలు అనుమానాలు ఉన్న అంశాలపై రాజకీయ నాయకులకు ఆర్డీవో అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో రోల్ అబ్జర్వర్‌గా కోలా భాస్కర్ నియమితులైనారని తెలిపారు. వివిధ జాతీయ రాజకీయ పార్టీ నాయకులకు ఏవైనా ఓటరు జాబితాపై మృతిచెందిన ఓటర్లపై అనుమానాలు ఉంటే వెంటనే ఈఆర్‌ఓకు తెలిపితే వెంటనే సంబందిత బిఎల్‌ఓల ద్వారా అప్లై చేయించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు దినోత్సవంలో విఆర్‌ఓలు అందరు ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు బిఎల్‌ఓ కేంద్రంలో హాజరవుతారని అక్కడ ఫారం 6,7,8లను దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషనర్ అవకాశం కల్పించారన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీనేతలు కామేష్‌యాదవ్, మిన్నల్‌రవి, గరికపాటిరమేష్‌బాబు, వెంకటేష్, మోహన్, జనమాల గురవయ్య, ఎఈఆర్‌ఓ ద్వారకానాథ్‌రెడ్డి ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ మించల నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వయంభుస్వామి ఆశ్రమంలో అన్నదానం



శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త : తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష పుట్టినరోజు సందర్భంగా భరద్వాజతీర్థంలోని సాధుస్వయంభువుస్వామి ఆశ్రమంలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆశ్రమంలో ఉన్న పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలకు పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కొత్తపేటలోని హరహరబావివీధిలో తెలుగు మహిళలు చక్రాల.ఉషకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్‌కట్‌చేసి చిన్నారులకు పంపిణీచేశారు. కార్యక్రమాల అనంతరం ఆమె యువగళం నేత తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌ను కలిశారు. కార్యక్రమంలో అనూష, స్వర్ణమ్మ, అమ్ములు, రత్న, కేశవ్, లోకేష్, రాజు, బుడ్డి, కవిత, సునీత, ప్రసన్న, నాయుడు, సవిత, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే అరుదైన శివలింగం...

# గుడిమల్లం పరశురామేశ్వరుడు

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్), నవంబర్ 28 ప్రభాతవార్త : ఆ దేవాలయం మన వాస్తుశాస్త్ర నియమాలకు విరుద్ధంగా పశ్చిమాభిముఖంగా ఉంటుంది. పురుషాంగాన్ని పోలిన శివలింగం మరో విశేషం. క్రీ.పూ. రెండోశతాబ్దం ప్రాంతంలో నిర్మించినట్లుగా చెబుతున్న ఈ ఆలయం మన రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలోని గుడిమల్లం. ఈ శివాలయం అనేక విశేషాలకు నిలయం. జిల్లాలోని పాపానాయుడుపేటకు నాలుగుకిలోమీటర్ల దూరంలోను శ్రీకాళహస్తికి 29కిలోమీటర్ల దూరంలోను గుడిమల్లం గ్రామం ఉంది. ఇక్కడి దేవాలయాన్ని పరశురామేశ్వరాలయంగా పిలుస్తారు. ఇది ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వ పురావస్తుశాఖ అధీనంలో ఉంది.

**అతిప్రాచీనం:**

పురావస్తు శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఈ గుడిలోని శివలింగం క్రీ.పూ. ఒకటి లేదా రెండోశతాబ్దం నాటిది. అయితే దీన్ని ఎవరు ప్రతిష్టించారో మాత్రం ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. గుడిమల్లంలోని శివాలయం ఉనికిని మొట్టమొదట బ్రిటీష్ ప్రభుత్వం 1910లో గుర్తించింది. ఆలయ నిర్మాణశైలిని బట్టి దీన్ని శాతవాహనులు నిర్మించినట్లు తెలుస్తోంది. ఆలయ తవ్వకాల్లో లభించిన ఒక శాసనం ప్రకారం..పన్నెండో శతాబ్దం విక్రమ చోళుడి కాలంలో ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. సాధారణంగా శివున్ని ఆలయాల్లో లింగా కారంలోనో అర్ధనారీశ్వరుడిగానో,నటరాజుగానో చూస్తాం. కానీ, గుడిమల్లంలోని శివలింగం మాత్రం విచిత్రంగా ఉంటుంది. పురుషాంగాన్ని పోలిన ఈ రూపం మరెక్కడా కనిపించదు. ఒకటిన్నర మీటర్ల పొడవున్న ఈలింగాన్ని నల్లరాతి ఏకశిలాతో తయారుచేసినట్లు తెలుస్తోంది. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి శివలింగం మనకు కనిపించదు.

**శివలింగం ప్రత్యేకత..**

ఇక్కడ వెలసిన లింగంలో..రాక్షసుడి భుజాలపై నిల్చున్నట్లున్న శివుడు, కుడిచేతిలో జింక(సారంగపాణి), ఎడమచేతిలో భిక్షపాత్ర, భుజంపై గండ్రగొడ్డలి, చెవులకు కుండలాలు, ముంజేతికి కడియాలు, మొలకు ధోవతి, తలకు లేత తాటికాయలు కిరీటం కనిపిస్తాయి. కానీ, యజ్ఞోపవీతం లేదు. ఇది మంగోలులను పోలిన రూపం కావడం విశేషం. ఈ లింగాన్ని ముఖలింగం అని కూడా వ్యవహరిస్తారు. శివుడి చేతిలో ఉన్న గొడ్డలిని బట్టి ఈ ఆలయానికి పరశురామేశ్వరాలయం అని పేరు వచ్చింది. ఉజ్జయిని తవ్వకాల్లో క్రీ.పూ మూడోశతాబ్దానికి చెందిన రాగినాణేలు లభించాయి. వాటిపై గుడిమల్లంలోని శివలింగాన్ని పోలిన చిత్రాన్ని కనుగొన్నారు.



విశేషాలంకరణలో గుడిమల్లం పరశురామేశ్వరస్వామి

ఉత్తరప్రదేశ్‌లోని మధుర మ్యూజియంలో భద్రపరచిన క్రీ.పూ. ఒకటో శతాబ్దానికి చెందిన లింగం గుడిమల్లంలోని శివలింగాన్ని పోలి ఉండటం విశేషం. పురావస్తుశాఖ 1973లో ఈ దేవాలయంలో తవ్వకాలు సాగించారు. అప్పుడు గర్భాలయంలో శివలింగం..పురాతన అవశేషాలున్న దిబ్బపై దొరికినట్లు తెలిసింది. ఇక్కడి పరిసరాల్లో క్రీ.పూ 2లేదా 3 శతాబ్దాలకు చెందిన మృణ్మయ పాత్రలు నలుపు ఎరుపు రంగుల్లో లభించాయి. శాతవాహనుల కాలం నాటి మెరిసే పాత్రల అవశేషాలు, పెద్ద సైజు ఇటుకలు అనేకం లభించాయి.

**గుడిమల్లం కాదు..గుడిపల్లం..!**

సాధారణంగా అన్ని ఆలయాలు తూర్పు ముఖంగా ఉంటాయి. కానీ, దీన్ని మాత్రం పశ్చిమాభిముఖంగా నిర్మించారు. అంతేకాదు, ఇటీవలే ఆలయానికి ధ్వజస్తంభం ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఉన్న దేవాలయ నిర్మాణం రెండంతస్తులుగా సాగింది. గర్భాలయం పైభాగం గజపృష్ఠాకారంలో అంటే ఏనుగు వెనుక భాగాన్ని పోలి ఉంటుంది. పల్లవుల కాలానికి చెందిన గుడి కనుక దీన్ని గుడిపల్లం అని పిలిచేవారట. గర్భగుడి పల్లంలో ఉండడం చేత గుడిపల్లం అనేవారని, కాలక్రమంలో అది "గుడిమల్లం"గా మారిందని చెబుతారు. చివరికి ఊరిపేరును కూడా ఈ ఆలయం పేరుమీదే గుడిమల్లంగా పిలుస్తున్నారు. ఆలయంలో లభించిన శాసనాల్లో మాత్రం ఈ పేరుకు సంబంధించిన ప్రస్తావన ఎక్కడా లేదు. చోళరాజుల శాసనం ప్రకారం.. ఈగ్రామాన్ని "తిరువిప్రంబేడు" అనే తమిళపేరుతో పిలిచేవారు. అంటే తెలుగులో "శ్రీవిప్రపీఠం" అని అర్థం. దీన్ని బట్టి ఆకాలంలో ఈ గ్రామం బ్రాహ్మణ అగ్రహారం కావచ్చని తెలుస్తోంది. దేవాలయం నిర్మాణం రెండో దశ చోళుల హయాంలో జరిగింది. గర్భగుడికి ప్రదక్షిణ సౌకర్యం కల్పిస్తూ మండపాలు, అంతరాళం, కుడ్యాలంకారాలతో నిర్మించారు. పడమటివైపు ప్రవేశగోపుర ద్వారం, ప్రాంగణంలో పరివారదేవతలకు చిన్నచిన్న గుళ్లు నిర్మించారు. ఇందులో సూర్యుడు, కార్తికేయుడు, దేవీ విగ్రహాలు ఉన్నాయి. అన్నింటినీ కలుపుతూ ప్రాకార నిర్మాణం జరిగింది. స్వామివారి అభిషేకానికి యాదవరాజుల కాలంలో క్రీ.శ.1346లోబావిని తవ్వించినట్లు తెలుస్తోంది. క్రీ.శ 8వ శతాబ్దం నుంచి ఈ ఆలయంలో పూజాదికాలు జరిగినట్లు పురావస్తు శాస్త్రవేత్తల అంచనా. ప్రస్తుతం మాత్రం ఆలయంలో నిత్యం ధూపదీప నైవేద్యాలు స్వామివారికి అభిషేకాలు జరుగుతున్నాయి. తిరుపతి నుంచి 20కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడిమల్లం చేరుకునేందుకు ఆర్టీసి బస్సులు ఉన్నాయి. దేశంలోనే అత్యంత ప్రాచీన ఆలయాల్లో ఒకటిగా పేర్కొనబడుతోంది. ఇప్పుడిప్పుడే ఆలయాన్ని అభివృద్ధిచేస్తున్నారు. ఏది ఏమైనా అతిపురాతన ఆలయాల్లో ఇది ఒకటని చెప్పుకోవచ్చు. ఈ కార్తీక మాసంలో ఇక్కడ వెలసిన శివయ్యను దర్శించుకుంటే ఎంతో ఎంతో శుభప్రదమని చెబుతారు.

## కాణిపాకం ప్రచారరథంను దర్శించుకున్న దేవాదాయశాఖ మంత్రి



కాణిపాకం, నవంబర్ 28 ప్రభాతవార్త: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ, హిందూ ధర్మపరిరక్షణ ట్రస్టు, కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంల సంయుక్త ఆధ్వర్యంలో ఆలయ ప్రాశస్త్యాన్ని, స్వామివారి విశిష్టతను తెలియజేసేందుకు వీలుగా తాడేపల్లె గూడెం, గోపీనాథపట ్నంలలో పర్యటిస్తున్న కాణిపాకం ప్రచారంరథంను డిప్యూటీ సీఎం, దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. తాడేపల్లె గూడెం, ఉంగుటూరు మండలం గోపీనాథపట ్నం నందు వెలసిన శ్రీభక్త వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా కాణిపాకం కాణిపాకం ప్రచారరథం అక్కడ పర్యటిస్తోంది. ఈసందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబసమేతంగా ప్రచారరథంలోని సిద్ది బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి రమేష్, ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టిరోడ్లపై వరినాట్లు వేసి తెదేపా నేతల నిరసన



శాంతిపురం, నవంబర్ 28 ప్రభాతవార్త : మండలంలోని గుండిశెట్టిపల్లి-ఎంకెపురం మార్గ ్ం ఇటీవల కురిసిన వర్షాలతో గుంతలు,బురదమయంగా మారింది. దీంతో మంగళవారం తెదేపా నేతలు, కార్యకర్తలు, పలువురు గ్రామస్తులు రోడ్డు గుంతల్లో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు గుంతలు, బురదమయమైన రోడ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, అధికార నేతలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజల అవసరాల దృష్ట్యా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేయించాలని లేకుంటే పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో ఉయ్యాల జయరాంరెడ్డి, మునిరెడ్డి, బయ్యారెడ్డి, చంద్ర, శ్రీనివాసులు, జమీర్, ప్రకాష్, వెంకటేష్, యాసిన్, రాజా, శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణ భేష్ : పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



చౌడేపల్లి, నవంబర్ 28 ప్రభాతవార్త : మండల కేంద్రమైన చౌడేపల్లి ఉన్నతపాఠశాల ఆవరణంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17బాల, బాలికల కబడ్డీ పోటీలను సక్రమంగా నిర్వహించారని ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిర్వాహకులకు కితాబునిచ్చారు. రాష్ట్రంలోని 13జిల్లాల్లోని అండర్-17బాల, బాలికలకు చౌడేపల్లి వేదికగా పోటీలు నిర్వహించారు. రాజంపేట, చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గాల యువత అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, పిల్లారి ఏజెన్సీస్ అధినేత పిల్లారి జీవన్‌ప్రకాష్, సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్, జిల్లా ప్రైవేటు పిఇటిల సంఘ కార్యదర్శి లీలాకుమార్‌నాగ్‌లు క్రీడాకారులకు దాతల సహకారంతో నివాసం, భోజన వసతులను కల్పించారు. ఇంతటి వసతులు తామెన్నడూ చూడలేదని క్రీడాకారులు, అధికారులు వారిని వేనోళ్ళపొగిడిని విషయం విధితమే. ఈక్రమంలో ఎంపి పెద్దింరెడ్డి మిథున్‌రెడ్డిని తిరుపతిలో ఆయన నివాసంలో కలసి ఆయన్ను దుశ్శాలవాలతో సన్మానించి జ్ఞాపికను అందించారు. క్రీడాపోటీలకు తాను రాలేక పోయాననీ, పోటీలను విజయవంతంగా ముగించినందుకు నిర్మాహకులను అభినందించారు. రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు రామచంద్రయ్య, మాజీ ఎంపిపి శ్రీరామ్‌రెడ్డి ప్రకాష్, కడియాల మహేష్‌బాబు, పగడాల రాములు ఎంపిని కలసినవారిలో వున్నారు.

## కల్లు దుకాణం ధ్వంసం

**-నిర్మాణాన్నడ్డుకొన్న స్థానికులు**



చౌడేపల్లి, నవంబర్ 28 ప్రభాతవార్త : నిత్యం జనసంచారం వున్న ప్రదేశంలో గల కల్లు దుకాణాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంతగేటు సమీపంలోని చౌడేపల్లి-ఆమినిగుంట దారిలో పట్టణానికి కూతవేటు దూరంలో ఓ కల్లు దుకాణం వెలసింది. ఆ దుకాణాన్ని రెండు రోజుల క్రితం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసారు. దీంతో మరలా దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు పూనుకొన్నారు. అయితే రోడ్డు పక్కనే కల్లు దుకాణం వుండటంతో గ్రామం నుంచి పాఠశాలలకు వచ్చే బాలికలు, పొలాలకు, ఆమినిగుంట సచివాలయానికి వెళ్ళే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, స్థానికులు దుకాణ నిర్మాణాన్ని అడ్డుకొన్నారు. ప్రశాంతంగా వున్న పల్లె వాతావరణంలో కల్లు దుకాణం ఏర్పాటు చేయరాదని వారంటున్నారు. కల్లు దుకాణానికి లైసెన్సు లేకుండా అనధికారికంగా నిర్వహిస్తున్నారనీ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని జనరద్దీ వున్న ఆమినిగుంట రోడ్డుపై కల్లు దుకాణం ఏర్పాటు చేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## రైతులకు వ్యవసాయ భూమికి పట్టాలను పంపిణీ



వెంకటగిరి, నవంబర్ 28 ప్రభాతవార్త : మనసున్న మహానేత సిఎం జగన్మోహన్ రెడ్డి అని రాష్ట్ర కమిటీ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఓ కళ్యాణ మండపంలో వెంకటగిరి డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని 300 మంది రైతులకు వ్యవసాయ భూమికి పట్టాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు మండలాల్లో ఇప్పుడు ఇచ్చిన భూమి చాలా తక్కువ అని తెలిపారు. సంక్రాంతి నాటికి 2000 మందికి భూమిని సేకరించి పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. 13 సంవత్సరాల క్రితం సిఎం జగన్మోహన్ రెడ్డి ఏడుసార్లు భూ పంపిణీ చేశారని మరలా ఇప్పుడు సిఎం జగన్మోహన్‌రెడ్డి పేదలకు భూములు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా ఉన్నట్లు చెప్పారు. సంక్రాంతి నాటికి రైతులకు 2000 ఎకరాల భూమి ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు పద్మావతి, శ్రీనివాసులు, నాయకులు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో సినీనటుడు సాయిధరమ్‌తేజ్



శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రముఖ సినీనటుడు సాయి ధరమ్ తేజ్ విచ్చేశారు. ఆయనకు ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఎఈవో సతీష్ మాలిక్‌లు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను ప్రత్యేక దర్శనంతో పాటు పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయనకు దక్షిణామూర్తి సన్నిధి వద్ద శేషవస్త్రాలతో సత్కరించి స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలు వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్ నాయుడు, సుబ్రమణ్యం, సుదర్శన్‌రెడ్డి, పసుపులేటి కామేశ్వరరావు, మరియు పట్టణ ప్రముఖులు సూరావారి సురేష్, సుధీర్, సునీల్, ప్రసాద్, ఈశ్వర్, సాయి, వేదపండితులు మరియు దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక దీపం పరమపవిత్రం

శ్రీకాళహస్తి, నవంబర్ 26 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్భంగా ఆకాశదీపాన్ని ఆలయంలోని ఊంజల్ సేవ మండపం ఎదురుగా ఆకాశదీపాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భక్తిశ్రద్ధలతో వెలిగించారు. ఈ ఉత్సవంలో దేవస్థానం అధికారులు అసిస్టెంట్ కమిషనర్



మల్లికార్జున ప్రసాద్, డిప్యూటీ ఈవో జె.వెంకటసుబ్బయ్య, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌నాయుడు, వేదపండితులు మరియు అర్చకులు చందుశర్మ, మరియు దేవస్థానం సిబ్బంది, ఛైర్మన్ సిసి సుదర్శన్‌రెడ్డి, దాము మరియు పాలమంగళం రవిలతో పాటు పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



కాణిపాకం, నవంబర్ 28 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం 2024 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు మంగళవారం ఆవిష్కరించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రతి సంవత్సరం క్యాలెండర్‌లను ముద్రించి విక్రయిస్తుంటుంది. ఈమేరకు దేవస్థానంలో ప్రతిరోజూ జరిగే పూజలు, వివిధ రకాల సేవల వివరాలు, ఉత్సవాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన క్యాలెండర్‌ను టెండర్‌దారు ఆకర్షణీయంగా ముద్రించారు. ఈక్యాలెండర్‌ను దేవస్థానం ఛైర్మన్ కార్యాలయంలో ఎమ్మెల్యే బాబు, ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## సచివాలయ ఎనర్జీ ఉద్యోగుల పోస్టుకార్డులు ఉద్యమం



సూళ్లూరుపేట, నవంబర్ 28 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ ఉద్యోగుల విషయంలో చిన్నచూపు చూస్తుందని నిరసిస్తూ తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉచ్చూరు సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాసం అశోక్‌రాజ్‌లు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, ఎనర్జీ ఉద్యోగులు వ్యయప్రయాసలకోర్చి కష్టపడి పనిచేస్తున్నారని, కానీ ప్రభుత్వం తమ పట్ల ఉదాశీన వైఖరి అవలంబిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రమాదకరమైన పనిచేస్తున్నా, తమ పట్ల చిన్నచూపు చూడటం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమ విషయంలో ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన కోర్కెలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే పని ఒత్తిడి వల్ల 130 మంది ఉద్యోగులు అశువులుబాశారన్నారు.

## అసమానతల నిర్మూలనకు పూలే కృషి



తిరుపతి క్రీడ, నవంబర్ 28 ప్రభాతవార్త : సమాజంలో అసమానతల నిర్మూలనకు మహాత్మా జ్యోతిభా పూలే ఎనలేని కృషి చేశారని ఎపిఎస్ పిడిసిఎల్ డైరెక్టర్లు వివిఎస్ బాబు, ఎన్వీఎస్ సుబ్బరాజులు పేర్కొన్నారు. ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం ఉదయం మహాత్మా జ్యోతిభా పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వివిఎస్ బాబు, డైరెక్టర్ ఎన్వీఎస్ సుబ్బరాజులు మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు, నిమ్న కులాల ప్రజలకు ఎదురయ్యే సాంఘిక దుశ్చర్యలపై జ్ఞానోదయాన్ని కల్పించేందుకు పూలే ఎనలేని కృషి చేశారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన పాటుపడ్డారని కొనియాడారు. నేటి సమాజంలోని ప్రతి ఒక్కరూ మహనీయుల ఆశయాలను అనుగుణంగా నడుచుకుంటూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ ఎన్. శివప్రసాద్ రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు వై.లక్ష్మి నరసయ్య, కె. గురవయ్య, జాయింట్ సెక్రటరీ ఎ.రాధాజయ శ్రీ, జనరల్ మేనేజర్లు గోపాల కృష్ణ, చంద్ర శేఖర రావు, రామచంద్ర రావు, శోభావాలంటీనా, సురేంద్రరావు, శ్రీకాంత్, శ్రీనివాసులు, బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్, నాయకులు చలపతి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **SYEDHU ABDUL KHADAR** S/o Syedhu Mahaboob Saheb (old Name) R/atD.No. 6-5, Railway Gate Street, Piler (M), Annamayya Dist.A.P. I have changed my name to **SYED ABDUL KHADAR,** S/o Syed Mahaboob Saheb (New Name)

వార్త

ప్రభాతవార్తకు విలేకరులు కావలెను

తెలుగు దిన పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

తిరుపతి టౌన్, తిరుపతి ప్రెస్‌క్లబ్, తిరుపతి ఎడ్యుకేషన్, తిరుపతి జిల్లా కలెక్టరేట్, తిరుచానూరు, చిత్తూరు టౌన్, చిత్తూరు జిల్లా కలెక్టరేట్, పలమనేరు, పుంగనూరు, పాలసముద్రం, నాయుడుపేట, ఓజిలి కేంద్రాల్లో పనిచేయుటకు.

మీ పూర్తి బయోడేటాతో...

వారం రోజుల లోపు ఈ క్రింది అడ్రస్సును సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, మూడవ మైలురాయి, రేణిగుంటరోడ్డు, తిరుపతి. సెల్: 9848131880